నిద్రమత్తులో నిఘా

- ఇంటెలిజెన్స్, ఐబీ, ఎస్బీ వరసగా అట్టర్‌ఫ్లాప్ షో
- సీఎం ఇలాకాలోనే ఫార్మాసిటీ ఆందోళనలు
- రైతుల నిరసనలపై నిఘా పెట్టని ఇంటెలిజెన్స్
- నిఘా వైఫల్యంతో అధికారులపై రైతుల దాడి

ప్రజా ఆందోళనల్లో కొట్టొచ్చిన నిఘా వైఫల్యం

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఇంటెలిజెన్స్ నిద్రమత్తు వదలడం లేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇలాకాలో రైతులు ఆందోళనలు చేస్తున్నా.. ఆ విషయాన్ని సీఎంకు ఉప్పందించడంలో ఇంటెలిజెన్స్ విభాగం పూర్తిగా విఫలమైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఫార్మా కంపెనీలను కొన్ని నెలలుగా రైతులు వ్యతిరేకిస్తున్నా ఆ అంశంలోని సున్నితత్వాన్ని ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారులు గుర్తించలేకపోయారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్‌తోపాటు కడా ప్రత్యేకాధికారి పర్యటిస్తారని తెలిసి కూడా.. రైతుల ఆందోళనను పసిగట్టలేకపోయింది.

ఫోన్ల ట్యాంపింగ్‌లో బిజీ బిజీ!

ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు బీఆర్ఎస్‌లోని ముఖ్యనేతలు, కాంగ్రెస్‌లోని అసమ్మతి నేతల ఫోన్లను ట్యాప్ చేయడంలోనే ఇంటెలిజెన్స్ బిజీగా ఉన్నట్టు సమాచారం. ప్రజా ఆందోళనలు, ఉగ్రకదలికలను పసిగట్టలేకపోయింది. ఓ ఉగ్రవాది హైదరాబాద్‌లో ఆరునెలలు తలదాచుకున్నా.. అతని ఉనికిని అంచనా వేయడంలో పూర్తిగా విఫలమైంది. ఢిల్లీ నుంచి ఎన్ఐఏ అధికారులొచ్చి అతన్ని అరెస్టు చేసేవరకూ రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం చేష్టలుడిగి చూసింది.

మత ఘర్షణలతో కల్లోలం..

11 నెలల కాంగ్రెస్ పాలనలో 9చోట్ల మత ఘర్షణలకు బీజం పడటం చూస్తే.. ముమ్మాటు రాష్ట్రం రావణకాష్టంగా రగిలిపోతుందేమోనని రాజకీయ విశ్లేషకులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. భైంసా, పాతబస్తీ, మెదక్, బోడుప్పల్‌లో ఘర్షణలు కలవరపెట్టాయి. మెదక్ మతఘర్షణల్లో నిర్లక్ష్యం వహించిన మెదక్ టౌన్, రూరల్ స్టేషన్ల సీఐలను నాటి ఐజీ రంగనాథ్ డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడి ఘటనలో ఓ వర్గానికి చెందిన 151 మంది యువకులు సికింద్రాబాద్‌లోని ఓ హోటల్లో 59 గదుల్లో మకాం వేయడం విస్మయానికి గురిచేసింది.

మియాపూర్ రాళ్లదాడిలో..

జూన్‌లో మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాలు పంచుతున్నారని సామాజిక మాధ్యమాల్లో ఓ వార్త వైరలైంది. రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం పోటెత్తిరాగా లాఠీచార్జి వరకు వెళ్లింది. చిలకలగూడ, ఉప్పల్, మేడ్చల్, హయత్‌నగర్ ప్రాంతాల్లో దొంగతనాలకు గ్యాంగులు వచ్చాయని ఆలస్యంగా గుర్తించింది. ఇటీవల నగరంలోని ఆసిఫ్‌నగర్‌లో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే వరుసగా మూడు హత్యలు జరిగాయి. ఇంత జరుగుతున్నా ఇంటెలిజెన్స్ విభాగానికి సమాచారం లేకపోవడం గమనార్హం.

సచివాలయం ముట్టడిలో..

గ్రూప్-1 పరీక్షను లీషెడ్యూల్ చేయాలని అభ్యర్థులు అక్టోబర్ రెండోవారంలో అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చి క్యాండిళ్లతో నిరసన వ్యక్తం చేసినా ఇంటెలిజెన్స్ విభాగం పసిగట్టలేదు. వారంతా సెక్రటేరియట్‌ను ముట్టడిస్తారని తెలిసి అభ్యర్థుల రూములోకి చొచ్చుకెళ్లి.. వ్యాన్లలోకి ఈడ్చిపడేశారు. బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి భార్యలు రోడ్లెక్కి నిరసన తెలిపారు. కుటుంబాలతో సచివాలయాన్ని ముట్టడించారు. వారి పోరాటం నుంచి కూడా పాఠం నేర్చుకోకపోవడంతో హోంగార్డులు ఆందోళన బాటపట్టారు. వారు కూడా కుటుంబాలతో సచివాలయం ముట్టడికి యత్నించడంతో.. అప్పటికి తేరుకొని జిల్లాల సరిహద్దుల్లోనే నిలువరించారు.

రేవంత్ నిర్వాకం ఫలితమే దాడి

సర్కార్‌పై వికారాబాద్‌లో పెల్లుబికిన ప్రజాగ్రహం.. ఫార్మాసిటీకి బీఆర్ఎస్ హయాంలోనే భూసేకరణ

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఫార్మాసిటీ రద్దు నిర్ణయం
- నగరం చుట్టూ కొత్తగా ఫార్మా క్లస్టర్ల ఏర్పాటు నిర్ణయం
- సీఎం జిల్లా నుంచే భూసేకరణ
- ఫార్మాసిటీని కొనసాగిస్తామని చెప్పిన ప్రభుత్వం
- క్లస్టర్లను ఉపసంహరించుకోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఫలితంగా ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

లగచర్లలో అధికారుల కారుపై రాళ్లతో దాడి చేస్తున్న ప్రజలు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): పచ్చని భూముల్లో ఫార్మా క్లస్టర్ వద్దు.. మా కడుపులు కొట్టొద్దు.. మాకు కడుపుకోత మిగిలించొద్దు.. అంటూ గత కొన్నాళ్లుగా ప్రజా నిరసనలు వెల్లువెత్తుతున్నా.. వినని రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజాగ్రహం పెల్లుబికింది. రైతుల నిరసనను పరిగణనలోకి తీసుకోని సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకంపైనే ఈ దాడి జరిగిందని పర్యావరణ వేత్తలు, రాజకీయ విశ్లేషకులు తేల్చిచెప్తున్నారు. వికారాబాద్ జిల్లాలో ఫార్మా క్లస్టర్ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, రెవెన్యూ సిబ్బందిపై జరిగిన దాడి.. కేవలం అధికారులపైన జరిగినది కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాలపై ప్రజాగ్రహంగా పరిగణించాలని పేర్కొంటున్నారు. వాస్తవానికి ఫార్మాసిటీ కోసం కేసీఆర్ ప్రభుత్వం 12,300 ఎకరాల భూమిని ఆనాడే సేకరించి సిద్ధం చేసింది. కానీ సీఎం రేవంత్‌రెడ్డి గద్దెనెక్కగానే 'ఫార్మాసిటీని రద్దు చేస్తున్నాం' అంటూ ముందు, వెనుకా ఆలోచించకుండా ప్రకటించేశారు. దాని స్థానంలో 10 ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అప్పట్లోనే ఈ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఒకేచోట సిద్ధంగా ఉన్న 12 వేల ఎకరాలను కాదని, హైదరాబాద్ చుట్టూ రసాయన పరిశ్రమలు పెట్టడం ఏమిటని నిపుణులు విస్మయం వ్యక్తంచేశారు. భూ సేకరణ ద్వారా పచ్చని పొలాలు నాశనం అవుతాయని హెచ్చరించినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు.

సీఎం సొంత గడ్డలోనే తీవ్ర వ్యతిరేకత

ఫార్మాసిటీ కోసం భూసేకరణను సొంత గడ్డ నుంచే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎం సొంత గడ్డమీదే ప్రజలు ఉద్యమబాట పట్టారు. 'గో బ్యాక్ ఫార్మా' అంటూ ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు చేపట్టారు. 'మా ప్రాంతం బిడ్డ సీఎం అయితే అభివృద్ధి జరుగుతుందని భావించాం. కానీ వేలాది ఎకరాలను గుంజుకుంటూ కడుపుకోత మిగుల్చుతున్నడు. పచ్చని పొలాల్లో ఫార్మా విషాన్ని నింపి మా జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడు' అని రైతులు, బాధిత గ్రామాల ప్రజలు మండిపడ్డారు. రెవెన్యూ అధికారులను కోరినా, మంత్రులకు విజ్ఞప్తి చేసినా, చివరికి సీఎంకు తమ గోడును వెళ్లబోసుకున్నా పట్టించుకోలేదు. దీంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. ప్రభుత్వం మాటలతో చెప్తే వినే పరిస్థితి లేదని వారికి అర్థమైంది. అందుకే అధికారులపై తిరగబడి దాడులు చేసే పరిస్థితి వచ్చిందని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

కొనసాగిస్తామంటూనే భూసేకరణ

ఒకవైపు రద్దు చేస్తామన్న ఫార్మాసిటీని మళ్లీ కొనసాగిస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. మరోవైపు దీనికి ప్రత్యామ్నాయంగా చేపడతామన్న ఫార్మ క్లస్టర్లలోనూ భూసేకరణకు దిగడం గమనార్హం. తొలుత ఫార్మాసిటీని రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రభుత్వం ఫార్మా విలేజ్‌లు లేదా ఫార్మా క్లస్టర్లను తెరమీదికి తెచ్చింది. 2 వేల ఎకరాలతో ఔటర్ రింగ్‌రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య 10 క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి, నోటిఫికేషన్లు ఇచ్చారు. ఫార్మాసిటీ కోసం బీఆర్ఎస్ హయాంలోనే సేకరించిన 12 వేల ఎకరాల భూమి అందుబాటులో ఉండగా, దాన్ని కాదని పచ్చని పల్లెల్లో విషాన్ని నింపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదంటూ మండిపడ్డారు. మరోవైపు ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో నిర్వాసితులైన రైతులు కోర్టుకు వెళ్లారు. వాళ్ల పోరాటానికి ప్రభుత్వం దిగివచ్చింది. ఫార్మాసిటీని రద్దు చేయలేదని, కొనసాగిస్తామని కోర్టుకు చెప్పింది. ఇదే దశలో ఫార్మా క్లస్టర్ల నోటిఫికేషన్లు మాత్రం రద్దు చేయలేదు. ఫార్మాసిటీని కొనసాగిస్తే ఫార్మా క్లస్టర్లు ఎందుకంటూ ఎంత మంది ప్రశ్నించినా ప్రభుత్వం మిన్నకుండిపోయింది. మొండిగా భూ సేకరణను ప్రారంభించింది. అటు ఫార్మాసిటీ కొనసాగిస్తామని చెప్తూనే మళ్లీ తమ జీవితాలను ఎందుకు ఆగం చేస్తున్నారంటూ రైతులు సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం పెంచుకున్నారు. ఈ ఆగ్రహం వికారాబాద్‌లో సోమవారం బయటపడింది. ఈ ఘటన అధికారులపై జరిగిన దాడి కాదని.. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకంపై జరిగిన దాడిగా పరిగణించాలని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

నందిగ్రామ్ అల్లర్లు (ఫైల్)

మరో నందిగ్రామ్!

- వికారాబాద్ ఘటనను 2007 బెంగాల్ ఘటనతో పోల్చుతూ నెటిజన్ల కామెంట్లు
- రైతుల ఉద్యమంతో పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన అప్పటి సర్కార్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ జిల్లాలో ఫార్మా కంపెనీ భూసేకరణకు వెళ్లిన అధికారులపై సోమవారం జరిగిన రైతుల దాడిని నెటిజన్లు 'నందిగ్రామ్' ఘటనతో పోలుస్తున్నారు. 2007లో పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్‌లో రైతులపై హింసాత్మక ఘటన చోటుచేసుకొన్నది. పోలీసుల కాల్పుల్లో 14 మంది రైతులు ప్రాణాలు విడిచారు. బెంగాల్‌లోని నందిగ్రామ్ ప్రాంతంలో సలీం గ్రూప్ ఆఫ్ ఇండోనేషియా కెమికల్ కంపెనీతో పాటు కెమికల్ సెజ్ కోసం అప్పటి లెఫ్ట్ ప్రభుత్వం 10 వేల ఎకరాల భూ సేకరణ చేపట్టాలని ప్రయత్నించింది. మార్చి 14, 2007లో భూ సర్వే కోసం అప్పటి కలెక్టర్, ఇతర రెవెన్యూ సిబ్బంది పరిసర గ్రామాల్లో పర్యటించారు. కెమికల్ ఫ్యాక్టరీతో తమ ఆర్థిక గ్యాలు చెడిపోతాయని, పచ్చని భూములు నాశనమవుతాయని గ్రామస్థులు ఎదురుతిరిగారు. తమ భూములను ఇచ్చేదిలేదంటూ అధికారులను కర్రలు, రాళ్లతో తరిమికొట్టారు. దీంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా 14 మంది చనిపోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా పెద్దఎత్తున సంచలనమైంది. ప్రజాగ్రహం పెరిగిపోతుండటంతో భూసేకరణ నిర్ణయాన్ని అప్పటి లెఫ్ట్ ప్రభుత్వం పక్కనబెట్టింది. ఈ ఘటన కారణంగానే 2011లో లెఫ్ట్ సర్కార్ బెంగాల్‌లో అధికారాన్ని కూడా కోల్పోయింది. తృణమూల్ కాంగ్రెస్ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది.

కనిపించని కాంగ్రెస్ నేతలు

- 5 ఊర్లవైపు వెళ్లని నాయకులు
- ఆగ్రహంతో ఊగుతున్న రైతులు

పరిగి, నవంబర్ 11 : దుద్యాల మండలం హకీంపేట, పోలేపల్లి, లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంటతండాల పరిధుల్లోని 1,375 ఎకరాల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయాలని భావించిన ప్రభుత్వం, ఇందుకోసం భూ సేకరణకు చర్యలు చేపట్టింది. దీనిని నిరసిస్తూ ఆ ఐదు గ్రామాల రైతులు ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలతో తమ ఉద్యమాన్ని ఉధృతంచేశారు. భూములు ఇచ్చేది లేదని అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలు ఇచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణ అంటూ తమ గ్రామాలకు మళ్లీ మళ్లీ రావొద్దని విజ్ఞప్తి చేశారు. రైతుల పోరాటానికి మద్దతుగా అక్టోబర్ 9న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పోలేపల్లి నుంచి దుద్యాల వరకు పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించగా సర్కార్ పోలీసులతో ముందస్తు అరెస్టుల ద్వారా అడ్డుకున్నది. పాదయాత్రకు వెళ్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని అరెస్టు చేశారు. అక్టోబర్ 25న లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభ ఏర్పాటు చేయగా రోటిబండతండా మీదుగా వెళ్తున్న కాంగ్రెస్ దుద్యాల మండలాధ్యక్షుడు శేఖర్‌ను రైతులు అడ్డుకొని, పంట పొలాల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటు ప్రతిపాదనను నువ్వే ముందుకు తీసుకుపోతున్నావంటూ నిలదీశారు. సోమవారం ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు లగచర్లకు దూరంగా హకీంపేట, దుద్యాల మధ్య వేదిక ఏర్పాటు చేయగా.. గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేకాధికారి లగచర్లకు వెళ్లగా దాడి జరిగింది. ఫార్మా రైతుల ఆందోళన, ఆగ్రహావేశాలతో దుద్యాల మండలంలోని అయిదు గ్రామాల వైపు కాంగ్రెస్ నేతలు కనీసం వెళ్లడం లేదని చెప్పొచ్చు.

అధికారులపై దాడి హేయం

లగచర్ల ఘటనపై ఉద్యోగ సంఘాల ఖండన

వికారాబాద్ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి, కొండగల్ తహసీల్దార్, ఇతర రెవెన్యూ సిబ్బందిపై లగచర్లలో సోమవారం జరిగిన దాడిని రెవెన్యూ ఉద్యోగ సంఘాలు ఖండించాయి. దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా విధులు బహిష్కరించాలని నిర్ణయించినట్టు టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ పిలుపునిచ్చారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, లక్ష్మణ్ (రంగారెడ్డి జిల్లా) శివకుమార్ (వికారాబాద్ జిల్లా) డిమాండ్ చేశారు. లగచర్లలో అధికారులపై దాడిని టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ ఖండించారు. దాడి నీతిమాలిన చర్య అని పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సుభాకర్‌రావు అభివర్ణించారు.

వికారాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా

వికారాబాద్ : కలెక్టర్, అదనపు కలెక్టర్‌పై రైతుల దాడిని నిరసిస్తూ సోమవారం వికారాబాద్ జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు విధులు బహిష్కరించారు. అన్నిశాఖల అధికారులు వికారాబాద్ కలెక్టరేట్‌కు చేరుకొని ధర్నాకు దిగారు. అనంతరం అక్కడికి చేరుకున్న కలెక్టర్ ప్రతీక్ జైన్ తనపై ఎలాంటి దాడి జరగలేదని, ఉద్యోగులు ఎవరి పనులు వారు చేసుకోవాలని సూచించారు. ధర్నాలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఆర్డీవో వాసుచంద్ర, డీఈవో రేణుకాదేవి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షిస్తాం: ఐజీ సత్యనారాయణ

అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని మల్టీజోన్-2 ఐజీపీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వికారాబాద్, బొంరాస్‌పేట ఠాణా పరిధి, దుద్యాల మండలం లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా చైర్మన్ వెంకట్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు వెళ్లారని చెప్పారు. లగచర్లలో వేదికను ఏర్పాటు చేయగా 11గంటల నుంచి 12:10 గంటల వరకు అక్కడికి రైతులు రాలేదని అదే సమయంలో గ్రామానికి చెందిన సురేశ్ కలెక్టర్ వద్దకు వచ్చి 'గ్రామంలో టెంట్ ఏర్పాటు చేశాం.. అక్కడికి వచ్చి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి' అని చెప్పడంతో కలెక్టర్ అధికారులు వెళ్లారు. వారిని గ్రామస్తులు తోసేశారని, కలెక్టర్ కాన్వాయ్‌పై రాళ్లతో దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారని, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా చైర్మన్ వెంకట్‌రెడ్డి, డీఎస్పీపై దాడి చేశారని చెప్పారు. ప్రాణాపాయం లేదని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన జేఏసీ నేతలు

పరిగి: కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను సోమవారం సాయంత్రం డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షురాలు రాధ, పూల్‌సింగ్ కలిశారు. ఘటన వివరాలు తెలుసుకున్నారు. తదుపరి కార్యాచరణపై వారు చర్చించినట్టు తెలిసింది.

వికారాబాద్ ఎస్పీపై వేటు?

హైదరాబాద్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోని దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్, అధికారులపై సోమవారం జరిగిన దాడిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్టు సమాచారం. వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని తెలిసింది. సీఎం సొంత నియోజకవర్గంలోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో అధికారుల్లోనూ భయాందోళన వ్యక్తమవుతున్నది. లగచర్లలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ రైతులతో మాట్లాడుతున్న సందర్భంగా దాడి జరిగింది. వెంటనే ఐజీ సత్యనారాయణ వికారాబాద్‌కు చేరుకొని పూర్తి వివరాలను సేకరించారు. గత నెల 25న కాంగ్రెస్ నాయకుడిపై రైతుల దాడి నేపథ్యంలో మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్నప్పుడు అప్రమత్తంగా ఉండి పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఎందుకు చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. భద్రతా వైఫల్యం నేపథ్యంలో ఎస్పీ నారాయణరెడ్డిపై వేటు వేసే అవకాశం ఉన్నదని ప్రచారం జరుగుతున్నది.

నాడు ఉసిగొల్పి.. నేడు ఉచ్చులోకి!

కాంగ్రెస్, బీజేపీలదే ఈ పాపం.. వికారాబాద్ ఘటనపై సర్వత్రా చర్చ

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పదేండ్లు ప్రజలను ప్రతీ అంశంపై రెచ్చగొట్టి, వారి మెదళ్లలో విష బీజాలునాటి కేసీఆర్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసినందుకు ఇవ్వాల తగిన మూల్యం చెల్లించుకోకతప్పని వాతావరణం నెలకొన్నది. నాడు కేసీఆర్ సర్కార్ చేపట్టిన ప్రతీ పనిని తప్పుగా ప్రజల్లోకి తీసుకెళ్లటంలో కాంగ్రెస్, బీజేపీలు పోటీపడ్డాయి. భూసేకరణ చట్టాల్లో పేర్కొన్న సూచనల కన్నా ప్రజామోద ప్యాకేజీలను ప్రకటించి వారి సమ్మతితో ప్రాజెక్టులను నిర్మించిన ఉదంతాలకు, ప్రస్తుతం రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న వైఖరికి మధ్య ఉన్న తేడా ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

చనిపోయినవారి పేర్లమీద కేసులు

ప్రాజెక్టు నిర్మాణ ప్రాంత ప్రజలు ప్రభుత్వానికి సహకరిస్తున్నా.. ప్రాజెక్టేతర ప్రాంతాల్లో సదరు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నాడు కాంగ్రెస్, బీజేపీలు పెద్ద వివాదాలే సృష్టించిన దాఖలాలు అనేకం. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని రాష్ట్ర మంతా ప్రచారం చేశారు. మరోవైపు ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదిత గ్రామాల ప్రజలను రెచ్చగొట్టేందుకు చేయని పనిలేదు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీజేపీలు ఆయా వేదికల మీద ఫిర్యాదు చేశాయి. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకోవటం కోసం కాంగ్రెస్ ఏకంగా మరణించిన వ్యక్తుల పేర్ల మీద కేసులు వేసిన సందర్భాలు ఉన్నాయి. వికాసాన్ని విధ్వంసంగా చిత్రీకరించారు.

నాటి బాధ్యతారాహిత్యమే...

వికారాబాద్ ప్రజాగ్రహానికి కాంగ్రెస్, బీజేపీల బాధ్యతారాహిత్యమే కారణమని అంటున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ రెండు పార్టీలు పోటీపడి ఉసిగొలిపినందుకే ఇవ్వాల తగిన మూల్యం చెల్లించుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటి బాధ్యరాహిత్యాన్నే అధికారంలో ఉన్నప్పుడూ కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నదని ఉదహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించటం వల్లే బూరోక్రాట్ల మీద దాడి దాకా తీసుకొచ్చిందని, ఇప్పటికైనా నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాల్సిన అవసరంఉందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

రగులుతున్న కొడంగల్ జనం

- సీఎం నియోజకవర్గంలో ఆగని ఆందోళనలు
- అన్నీనోటి మాటలే.. హామీలు నీటి మూటలే!
- సీఎం రేవంత్ తీరుపై పెల్లుబుకుతున్న అసంతృప్తి

మహబూబ్‌నగర్, నవంబర్ 11 (తెలంగాణ ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ఆందోళనలు, నిరసనలు నిత్యకృత్యమయ్యాయి. మార్పు వస్తుందని.. బతుకులు బాగుపడతాయని ఆశించిన నియోజకవర్గ ప్రజల ఆశలు అడియాశలే అయ్యాయి. ఇచ్చిన హామీలు నీటి మూటలే కావడంతో జనం పోరుబాట పట్టారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సొంత పార్టీ నాయకుల్లో, కార్యకర్తల్లో సైతం అసంతృప్తి పెల్లుబుకుతున్నది. పేరుకు మా ప్రాంత నేత సీఎం అయి 11 నెలలైనా ఒక్క కార్యక్రమం కూడా ముందుకు పడలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఇచ్చిన అడ్డగోలు హామీలు కూడా అమలు కాకపోవడంతో జనం ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. కొన్ని నెలలుగా నియోజకవర్గంలో ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు పెద్ద ఎత్తున జరుగుతుండటంతో అధికార పార్టీకి పాలుపోవడం లేదు. పైగా కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటుచేసినా ఇప్పటివరకు ఒక్క చెప్పుకోదగిన పని కూడా పూర్తికాలేదు. సీఎం అయ్యాక రేవంత్‌రెడ్డి మూడు నెలల తర్వాత నియోజకవర్గంలో అడుగుపెట్టి రూ.3,961 కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. అవి ఇంకా శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. హామీలను నెరవేర్చకపోవడంతోపాటు ప్రజలకు ఆలస్యంగానైనా అసలు విషయం తేట తెల్లమైంది. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు ఏదో ఒక చోట, నిత్యం ధర్నాలు చేపడుతున్నారు. కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో ఏర్పాటుచేసి దానికో అధికారిని నియమించి హడావుడి చేసినా ఇప్పటివరకు నయా పైసా ఖర్చు చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఫార్మా క్లస్టర్లపై ప్రజల తిరుగుబావుటా!

- ప్రతిపాదించిన ప్రతిచోట స్థానికుల ఆగ్రహం
- ఇప్పటికే వికారాబాద్, సంగారెడ్డిల్లో నోటిఫికేషన్
- నల్లగొండలో నోటిఫికేషన్ రాకముందే ఆందోళనలు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీ రద్దు అనంతరం ఔటర్ చుట్టూ ఉన్న జిల్లాల్లో 10 చోట్ల ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావించారు. ఒక్కో క్లస్టర్‌ను దాదాపు 2వేల ఎకరాలతో ఏర్పాటు చేయాలనుకుని, 20 వేల ఎకరాలను రైతుల నుంచి గుంజుకొని ఫార్మా సంస్థలకు అప్పగించాలని ప్లాన్ వేశారు. ఔటర్‌కు ఆర్ఆర్ఆర్‌కు మధ్య వికారాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో క్లస్టర్‌లో మూడునాలుగు ఫార్మా విలేజీలు అంటూ విచిత్రమైన ప్లాన్ వేసింది. ఈ మేరకు అధికారులు ఏయే గ్రామాల్లో అనుకూలమో ఫైల్‌ను సిద్ధం చేశారు. విషయం తెలిసినప్పటి నుంచే ఫార్మా క్లస్టర్లను వ్యతిరేకించడం మొదలుపెట్టారు.

సొంత జిల్లా న